# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదాయార్జన శాఖలపై అమరావతి సచివాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు.
- ❖ ప్రపంచ కాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అవగాహనా కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.
- ❖ ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా, ప్రజల కోసం పని చేస్తోందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆలయాల్లో రథసప్తమి వేడుకలు జరుగుతున్నాయి.

========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదాయార్జన శాఖలపై అమరావతి సచివాలయంలో ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

========================

క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తిరుపతిలో పాత్రికేయులతో మంత్రి ఈరోజు మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. గత రెండున్నర సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా 71 లక్షల మందికి క్యాన్సర్ పరీక్షలను నిర్వహించామని, ప్రతి ఒక్కరు ప్రభుత్వం నిర్వహించే ఈ పరీక్షలు చేయించుకోవాలని పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

=======================

జీవన శైలిలో మార్పులతోనే క్యాన్సర్ వ్యాధిని అరికట్టగలమని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి అన్నారు. "ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బాపట్లలో చేపట్టిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం బాపట్ల పట్టణంలోని కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రాథమిక స్థాయిలో ఉన్నప్పుడే క్యాన్సర్ ను అరికట్టగలమని, ఈ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు.

(వాయిస్ 27 సెకన్లు)

=======================

ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థలో ఆర్థిక కమిటీలను నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రజాపద్దుల సంఘం, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ, అంచనాల కమిటీల ఛైర్మన్‌లను అధికారికంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రజాపద్దుల సంఘం ఛైర్మన్‌గా పులవర్తి రామాంజనేయులు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ కమిటీ ఛైర్మన్‌గా కూన రవికుమార్, అంచనాల కమిటీ ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు నియామకాన్ని ఆమోదిస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఫైనాన్షియల్ కమిటీల నియామకం పూర్తైనట్టు స్పీకర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. 175 మంది శాసనసభ్యుల నుంచి 9 మంది చొప్పున, 58 మంది శాసనమండలి సభ్యుల నుంచి ముగ్గురు చొప్పున మూడు కమిటీల్లో నియమించినట్లు అధికారులు తెలియజేశారు.

=======================

అర్హులైన అందరికీ ఇళ్లు, పింఛన్లతో పాటు వికలాంగులకు పింఛన్లు అందిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలోని శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో నిర్వహించిన రథసప్తమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఈ దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. 2 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే ఘాట్ రోడ్డును త్వరలో ప్రారంభిస్తామ ని తెలిపారు.

=======================

రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆలయాల్లో రథసప్తమి వేడుకలు జరుగుతున్నాయి. తిరుమలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటున్నారు. తిరుమలలో సూర్యప్రభ వాహనంపై మలయప్ప స్వామిని తిరుమాడవీధుల్లో ఊరేగించారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయంలో జరుగుతున్న వేడుకల్లో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి విజయ్ చంద్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

విరామం

=======================

రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా, ప్రజల కోసం పని చేస్తోందని ఆ దిశగా వైయస్సార్ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర చేనేత జౌళి శాఖా మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. ఈరోజు స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో మంత్రి అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నారు. ప్రజలకు

జవాబుదారీతనంతో కూడిన సుపరిపాలన అందిస్తూ... స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్య సాధనకు కృషి చేయాలని ఆమె పేర్కొంటూ....

(వాయిస్ 18 సెకన్లు)

======================

స్వచ్ఛభారత్ లో భాగంగా రాష్ట్రంలో స్వచ్ఛ మచిలీపట్నం సాధనకు కృషి చేస్తున్నామని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఈ రోజు పలు డివిజన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. కాగితాలు, కవర్లను చెత్త డబ్బాలలో వేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 2025 డిసెంబర్ నాటికి ప్లాస్టిక్ రహిత మచిలీపట్నంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.

======================

బాల్య వివాహాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బాలికల సంక్షేమం, రక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాల్య వివాహాలను సామాజిక సమస్యగా గుర్తించి వాటి నివారణకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలు రహిత గ్రామంగా ప్రకటించిన గ్రామాలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారు పాఠశాలలకు వెళ్లేలా కృషి చేయాలన్నారు.

======================

పశ్చిమగోదావరి జిల్లాలో నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని ఈనెల 6వ తేదీన బహిరంగ వేలం వేయనున్నామని సంయుక్త కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈరోజు భీమవరంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో స్వాధీనం చేస్తుకున్న 48.330 మెట్రిక్ టన్నుల ప్రజా పంపిణీ బియ్యాన్ని కిలో 20 రూపాయల చొప్పున బహిరంగ వేలం వేయనున్నామని తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఉండిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆసక్తి కలిగిన వ్యాపారస్తులు ముందుగా 5 వేల రూపాయలు ధరావత్తు సొమ్మును చెల్లించాల్సి ఉంటుందని, వస్తు సేవల పన్ను లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు.

======================

రాష్ట్రంలో సంభవిస్తున్న కోళ్ళ మరణాల దృష్ట్యా కోళ్ళ మాంసము, గుడ్లను వినియోగించే ప్రజలలో ఏర్పడే అపోహలను నివృత్తి చేయడానికి పశుసంవర్ధక శాఖ అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర నాయుడు తెలిపారు. ఈమేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. సరైన జీవభద్రతా చర్యలు పాటించకపోవడం వల్ల కోళ్ళ మరణాలు జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

======================

రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ గడువును మార్చి నెలాఖరు వరకు ప్రభుత్వం పొడిగించిందని పౌరసరఫరాల సంస్థ ఎండీ మనజీర్ జిలాని ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల పేరుతో ఇతరులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కృష్ణా, శ్రీకాకుళం జిల్లాలలో ధాన్యం నిల్వలున్నాయని, తిరుపతి, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఖరీఫ్ ధాన్యం ఆలస్యంగా వస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల రైతుల వినతుల మేరకు ధాన్యం సేకరణ గడువును ప్రభుత్వం పొడిగించిందని తెలిపారు.

======================

ఉద్యాన పంటలకు మార్కెటింగ్ సదుపాయం, ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించే లక్ష్యంతో రేపు అనంతపురంలో 'అనంత ఉద్యాన సమ్మేళనం' పేరుతో  కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చెందిన సుమారు 60కి పైగా సంస్థలు, నాబార్డు, ప్రపంచ బ్యాంకు సహా వివిధ రంగాల ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు  హాజరవుతున్నారని పేర్కొన్నారు.

========================

========================